## క్లుప్తంగా

### నర్సరీల్లో కలుపు తొలగించండి


నర్సరీ మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మండలంలోని సాకడ, కొఠారి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను బుధవారం ఎంపీడీవో కృష్ణారావు పరిశీలించారు. నర్సరీల్లోని మొక్కల్లో ఉన్న కలుపును తొలగించాలని, పిచ్చిమొక్కలు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్కలను చూపుతూ నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రతీరోజు నీళ్ల పోసి మొక్కలను ఎండల తీవ్రత నుంచి సంరక్షించాలన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

### పనులు త్వరగా పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న చంద్రశేఖర్

కెరమెరి: త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కెరమెరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని కరంజివాడ, దేవాపూర్ ప్రాథమిక పాఠశాల్లో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఆయన సందర్శించారు. విద్యుత్, మరుగుదొడ్లు, మరమ్మతులు తక్షణమే పూర్తి చేయాలన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: బెజ్జూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఏటిగూడా గ్రామానికి చెందిన మాడే అమ్మక్క బుధవారం మృతిచెందగా, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ఆదేశాల మేరకు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సామల తిరుపతి, నెల్లి మహేశ్, రమేశ్, అన్నారం తిరుపతి, ఇప్పకాయల శంకర్, రాములు, పోషన్న, శంకర్, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

### రుణాలు సకాలంలో చెల్లించాలి


సభ్యులతో మాట్లాడుతున్న ఆర్ఎం శ్రీనివాస్

కెరమెరి: బ్యాంకులు, స్త్రీనిధి నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఐకేపీ ఆర్ఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని ధనోరా, సుర్దాపూర్ గ్రామాల్లో వీవో, ఎస్‌హెచ్‌జీ సంఘ సభ్యులతో మాట్లాడారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు, వృత్తి వ్యాపారాల్లో ముందుండాలని రుణాలు అందజేసినట్లు పేర్కొన్నారు. కాని సకాలంలో చెల్లించకపోతే ఆర్థిక భారం పెరుగుతుందన్నారు. ఆయన వెంట స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ హాక్టు, సీసీ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

### పేకాట స్థావరంపై దాడి

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం కాగజ్‌నగర్ పోలీసులు దాడి చేసినట్లు కాగజ్‌నగర్ ఎస్‌హెచ్‌వో శంకరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై అంజయ్య ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు పేకాటరాయుళ్లను పట్టుకున్నామన్నారు. పట్టణంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతుండగా దాడి చేసి వారి వద్ద నుంచి రూ.28 వేల నగదుతో పాటు నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

### పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

ఉట్నూర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రత్యేక బలగాలతో మార్చ్‌ఫ్లాగ్ నిర్వహించినట్లు ఉట్నూర్ సీఐ మొగిలి తెలిపారు. బుధవారం పట్టణంలో పాత బస్టాండ్ నుంచి అంగడీ బజార్, ఐబీ చౌరస్తా, ఎన్టీఆర్ చౌక్, ఐటీడీఏ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం మీదుగా పోలీసుస్టేషన్ వరకు ఫ్లాగ్‌మార్చ్ సాగింది. ప్రజలు ఎలాంటి భయబ్రాంతులకు గురికాకుండా ధైర్యంగా ముందుకొచ్చి ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మనోహర్, ప్రత్యేక బలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తగ్గనున్న దూరభారం


దేవులగూడ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పోలింగ్ కేంద్రం

- మండలంలో కొత్తగా 10 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ఆవాస గ్రామాల ఓటర్లకు తప్పిన తిప్పలు
- సౌకర్యాలు కల్పించాలని విన్నపం

రెబ్బెన: వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అధికారులు స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండేలా తాత్కాలిక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో కొన్నేళ్లుగా కిలోమీటర్ల దూరం వెళ్లి ఓటుహక్కు వినయోగించుకుంటున్న ప్రజలకు ఈసారి ఆ బాధలు తప్పనున్నాయి. గతంలో స్థానికంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఆవాస గ్రామాల ప్రజలు ఓటు వేసేందుకు కిలోమీటర్ల దూరంలో ఉండే పక్క గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుండడంతో ఓటుహక్కు వినియోగించుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. దీంతో ఓటింగ్ శాతంపై ప్రభావం పడేది.

**కొత్తగా 10 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు**

మండలంలో 24 గ్రామపంచాయతీల పరిధిలో అసెంబ్లీ ఎన్నికల వరకు 37 పోలింగ్ కేంద్రాలు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఆవాస గ్రామాల ప్రజలకు స్థానికంగా పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉండేవి కావు. దూర ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవాల్సి వచ్చేది. దీంతో కొంతమంది ఓటు వేయడానికి ఆసక్తి చూపేవారు కాదు. కూలీ పనులు చేసుకునేవారు పనులు ముగించుకొని దూర ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సరికి సమయం ముగిసిపోయేది. దీంతో ఓటింగ్ శాతం తక్కువగా నమోదయ్యేది. వీటిని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల కోసం ఆవాస గ్రామాల్లో తాత్కాలికంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. మండలంలో 10 కొత్త పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. రాంపూర్, నేర్పల్లి, రాళ్లపేట, సింగల్‌గూడ, గొల్లగూడ, పైకాజీగూడ, దేవులగూడ, సోనాపూర్, కైరిగూడ, కొత్తపులికుంట గ్రామాల్లో తాత్కాలిక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**సౌకర్యాల పరిస్థితి..?**

అధికారులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల్లో తాత్కాలిక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు ఉన్న ప్రదేశాల్లో నీటి సరఫరా లేకపోవటంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఎన్నికలకు సమయం ఉండటంతో ఆలోగా సౌకర్యాలు కల్పించాలని ఓటర్లు కోరుతున్నారు.

### గోలేటికి పోవాల్సిన పనిలేదు



మా ఊరు గోలేటి గ్రామ పంచాయతీ కిందకి వస్తది. ఇదివరకు ఎప్పుడు ఎన్నికలు వచ్చిన ఓటు వేసేందుకు గోలేటికి వెళ్లే వాళ్లం. ఓటు వేయాలంటే కనీసం 5 కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేది. వృద్ధులు అంత దూరం వెళ్లి ఓటు వేయడం ఇబ్బందిగా ఉండేది. కానీ ఈసారి ఓటు వేసేందుకు గోలేటి వరకు వెళ్లాల్సిన పని లేకుండా మా ఊరిలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. - రాపాల సుగుణ

### అందుబాటులో పోలింగ్ కేంద్రం



మేము ఎప్పుడు ఓట్లు వేయాలన్నా కొండపల్లికి వెళ్లేవాళ్లం. వానాకాలంలో ఎన్నికలు వస్తే బురదమయంగా మారిన మట్టి రోడ్డుపై ఇబ్బంది పడుతూ వెళ్లి ఓట్లు వేసే వాళ్లం. ఈసారి విపరీతంగా ఎండలు కొడుతున్నాయి. ఎండల్లో కొండపల్లికి ఎలా వెళ్లాలనుకుంటున్నాం. ఇంతలోనే మా గ్రామంలోనే కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు.

- సదాశివ్, రాంపూర్

### తాత్కాలిక కేంద్రాలు ఏర్పాటు చేశాం

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలో కొత్తగా 10 తాత్కాలిక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. గతంలో ఆవాస గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు ఉండేవి కాదు. దాంతో పక్క గ్రామాలకు వెళ్లి ఓటు వేయాల్సి వచ్చేది. ఈ సారి అలా కాకుండా ఆవాస గ్రామాల్లోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయటం మూలంగా ఓటింగ్ శాతం కూడా పెరిగే అవకాశం ఉంది.

- ప్రేం కిరణ్, ఆర్ఐ

# పొంచి ఉన్న ప్రమాదం

- కోతకు గురైన కల్వర్టు
- మూడేళ్లుగా అదే దుస్థితి


పూల్‌సింగ్ తండా వెళ్లే రోడ్డులో కోతకు గురైన కల్వర్టు

లింగాపూర్: గతంలో కురిసిన భారీ వర్షాలకు ఒర్రెలు, వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు, వంతెనలు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. అనేక కల్వర్టులు కోతకు గురయ్యాయి. కోతకు గురై మూడేళ్ల గడుస్తున్నా కల్వర్టులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దంపూర్, ఖీమానాయక్ తండా, గోపేర, లోద్దిగూడ, రామునాయక్ తండా గ్రామస్తులు నిత్యావసర సరుకుల కోసం మండల కేంద్రానికి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ మార్గంలో రోడ్డుపై కల్వర్టు కోతకు గురికాగా పెద్ద ప్రమాదం పొంచి ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మళ్లీ భారీ వర్షాలు కురిస్తే మిగిలిన రోడ్డు కూడా పూర్తిగా కోతకు గురయ్యే ప్రమాదం ఉందని, అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

**ప్రమాదకరంగా అప్రోచ్ కల్వర్టు**

మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్లపై నిర్మించిన కల్వర్టులు వరదల ధాటికి కోతకు గురయ్యాయి. మూడేళ్లుగా ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణాలు సాగిస్తున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. మోతిపటార్ వెళ్లే రహదారిపై కోతకు గురైన కల్వర్టుకు గతంలో అధికారులు రూ. 2లక్షలతో పనులు చేపట్టారు. గత ఏడాది కురిసిన భారీ వర్షానికి సగానికి పైగా కోతకు గురైంది. జైనూర్ నుంచి లింగాపూర్ ప్రధాన రహదారిలో ఉన్న బ్రిడ్జీలు, పిట్టగూడ, లింగాపూర్, రావునూర్, గుమ్నూర్, వంకామద్ది గ్రామాలకు వెళ్లే రహదారులపై ఉన్న కల్వర్టు అప్రోచ్‌లు వరదలకు భారీగా కోతకు గురయ్యాయి. వరదలు వచ్చిన సమయంలో అధికారులు, నాయకులు సంఘటన ప్రాంతాలకు వెళ్లి కొన్నిచోట్ల తాత్కాలికంగా మట్టితో మరమ్మతులు చేయించి చేతులు దులుపుకున్నారు. వరదలు వచ్చిన ప్రతీసారి మట్టితో చేపట్టిన పనులు కోతకు గురికావడం మళ్లీ తాత్కాలికంగా పనులు చేపట్టడం పరిపాటిగా మారింది. అధికారులు దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### భయంగా ప్రయాణాలు సాగిస్తున్నాం



మా గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న కల్వర్టు అప్రోచ్ వరదల ధాటికి కొట్టుకుపోయింది. కల్వర్టు సగానికి పైగా కోతకు గురై భారీ గుంత ఏర్పడింది. మూడేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉంది. రాత్రి వేళల్లో పశువులు గుంతలో పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వాహనాలు కొంచెం అదుపు తప్పితే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలి.

- రాథోడ్ అనిల్‌కుమార్, పూల్‌సింగ్ తండా

# 'అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు


పెంచికల్‌పేట్‌లో..


రెబ్బెన: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

దహెగాం: మోదీ నాయకత్వంలోనే భారతదేశం అభివృద్ధి చెందుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని ఇట్యాల, కోత్మీర్, ఒడ్డుగూడ గ్రామాల్లో ఎంపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ దేశానికి రక్షణగా ఉంటుందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తుందన్నారు. ఈ నెల 13న పోలింగ్ రోజు కమలం గుర్తుకు ఓటు బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రెబ్బెన: దేశ అభివృద్ధి, రక్షణ కోసం పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మరోసారి బీజేపీని గెలిపించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని నంబాలలో బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు బీజేపీ మెనిఫెస్టోను వివరించారు. కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ, మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి, ప్రధాన కార్యదర్శి నవీన్, బీజేవైఎం నాయకులు మల్రాజు రాంబాబు, బూత్ అధ్యక్షుడు ఆనంద్, మల్లేశ్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని దరోగపల్లి గ్రామంలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లకాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎంపీటీసీ రాజన్న, మండల అధ్యక్షుడు మధుకర్, ఘనపురం నగేశ్, బోయిరే నానయ్య, కర్నే మహేశ్, వెంకన్న, పోశన్న, ప్రభాకర్, యువకులు పాల్గొన్నారు.

బెజ్జూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నాయకులు ప్రచారాన్ని విస్తృతం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు సామల తిరుపతి, ఏలేశ్వరం రమేశ్, నెల్లి మహేశ్, తిరుపతి, మంజుల, మల్లయ్య, మాంతయ్య, విజయ్, లింగయ్య, కమలాకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### 'బీజేపీ సభ విజయవంతం చేయండి'


మాట్లాడుతున్న నాయకులు

బెజ్జూర్: బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 11న మండల కేంద్రంలోని ఎస్సీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీలు కొండ్రా మనోహర్ గౌడ్, కొప్పుల శంకర్‌లు కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు ఓటరు జాబితాతో పాటు గోడ స్టిక్కర్లను కార్యకర్తలకు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు సామల తిరుపతి, కొండవీటి భాస్కర్ రాజు, నేరెళ్ల సంతోష్, జాడి దిగంబర్, వసీఖాన్, శ్యాంసుందర్, రమేశ్, కిష్టయ్య, మహేష్, రాజు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుల ప్రచారం


దేవాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కెరమెరి: మండలంలోని దేవాపూర్, తుమ్మగూడ, కరంజివాడ, బోరిలాల్‌గూడ, అనార్‌పల్లి గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ పెందోర్ మోతీరాం, వైస్‌ఎంపీపీ అబ్దుల్ కలాం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు ఉన్నారు.

# ఐఎన్‌టీయూసీ ఫిట్ కమిటీల ఎన్నిక


ఫిట్ కమిటీ సభ్యులతో ఏరియా నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్, స్టోర్స్‌లలో బుధవారం ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఫిట్ కమిటీలను ఎన్నుకున్నట్లు ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ నాయకులు ప్రకాశ్‌రావు తెలిపారు. సీహెచ్‌పీ ఫిట్ కార్యదర్శిగా దుంద్రా రవికుమార్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శిగా కొవ్వూరి శ్రీకాంత్, కోశాధికారిగా సత్యనారాయణ, జనరల్ షిఫ్టు ఇన్‌చార్జిగా ఎంబడి అర్జయ్య, ఏరియా వర్క్‌షాప్ ఫిట్ కార్యదర్శిగా కందుల తిరుపతి, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శిగా ఎండీ ఇనూస్, కోశాధికారిగా సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా సత్యనారాయణ, వీరన్న, శ్రీనివాస్, మమత, స్టోర్స్ ఫిట్ కార్యదర్శిగా దుస్స మహేశ్‌లను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమాల్లో కేంద్ర కమిటీ సభ్యులు రామారావు, సీనియర్ నాయకులు రాజన్న, ఏరియా కార్యదర్శి చంద్రకుమార్, నాయకులు గట్టయ్య, ఈశ్వర్, శ్యాంబాబు, తిరుపతి, మల్లేశ్, సంతోష్, కిషన్, రాజయ్య, మహేందర్, సాయి, సదానందం పాల్గొన్నారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని కాగజ్‌నగర్ పట్టణంలోని చింతగూడ రైల్వేగేట్ వద్ద విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. 122 క్వింటాళ్ల బియ్యాన్ని వ్యాన్‌లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి సయ్యద్ ఆరిఫ్, ఇషాక్ అహ్మద్‌లపై 6 -ఏ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు డీటీలు శ్యాంలాల్, శ్రీనివాస్‌లు తెలిపారు.

### సమాజ సేవలో యువత ముందుండాలి

ఆదిలాబాద్‌టౌన్: సమాజ సేవలో యువత ముందుండాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ బాలశంకర్ కృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ప్రపంచ రెడ్‌క్రాస్ సొసైటీ, సికిల్‌సెల్ దినోత్సవాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఫౌండర్ జాన్‌హెన్రి డునంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించి, సమాజాన్ని చైతన్యం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ప్రశాంత్, ప్రఫుల్ వర్మే, చరణ్‌గౌడ్, బండారి దేవన్న, సామ రూపేష్‌రెడ్డి, దొంతుల ప్రవీణ్, అర్బాత్ ఖాన్ పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో భీరన్న ఉత్సవాలు

తాండూర్: మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో భీరన్న పండుగ ఉత్సవాలు వారం రోజుల నుంచి భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం నాగవెల్లి కార్యక్రమం నిర్వహించారు. యాదవులు భారీ ఎత్తున బోనాలతో వెళ్లి పూజలు చేశారు. ఉత్సవ వేడుకల్లో భాగంగా ఒగ్గు కథ, లింగాలు తీయడం, నాగవెల్లి కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎల్లాకుల రవికుమార్, హరికృష్ణ, చంద్రగిరి శ్రీనివాస్, ఎల్లాకుల సురేష్, వేల్పుల సురేష్, రాగులయ్య, బుర్ర శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### లోక్‌నాథ్ బాబా ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎఫ్‌కాలనీలోని లోక్‌నాథ్ బాబా ఆలయం రెండో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన హోమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# 'ఆత్రం సుగుణను గెలిపించాలి'


కెరమెరి: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


లింగాపూర్: కంచన్‌పల్లిలో..


పెంచికల్‌పేట్: ప్రచారం నిర్వహిస్తున్న శ్రేణులు

కెరమెరి: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బుధవారం మండలంలోని ముకదంగూడ, మహరాజ్‌గూడ, పరంధోళి, తదితర గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. దేశంలో బీజేపీ ఎలాంటి అభివృద్ధి చేయలేదని, బీఆర్ఎస్ ఏ వర్గానికి కూడా న్యాయం చేయలేదని ఆరోపించారు. ఆదిలాబాద్ పార్లమెంట్‌లో చేయి గుర్తుకు ఓటు వేసి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, మండలాధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు, నాయకులు ఎల్లప్ప, బాబునాయక్, శ్రీనివాస్, రవిరాథోడ్, వెంకటస్వామి, జల్పత్‌రావు, ధరంసింగ్ తదితరులు ఉన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ తరఫున బుధవారం కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. మండల కోఆప్షన్ సభ్యుడు సాజీద్, నాయకులు రాజేశ్వర్, లాంచు, కొండన్న, బాపు, పెంటన్న, శంకర్, భీమయ్య, అనిల్, నాగా, యువకులు పాల్గొన్నారు.

లింగాపూర్: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని మండల అధ్యక్షుడు లోకేందర్ అన్నారు. బుధవారం మండలంలోని కంచన్‌పల్లి, మోతిపటార్, గుమ్నూర్ తదితర గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఎస్టీ సెల్ వైస్‌చైర్మన్ చవాన్ సునీల్, ధర్ము, భీంరావ్, రాము పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బాబాపూర్, ఖాప్రి, బేల్గాంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం పూట ఇంట్లో ఎవరూ లేకుండా ఉపాధిపనులకు వెళ్లడంతో నాయకులు కూడ పని ప్రదేశాలకు వెళ్లి తమ పార్టీకి ఓటు వేయాలని వేడుకున్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుగుణకు ఓటు వేసి గెలించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, మంగ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: కార్మిక, కర్షక, రైతులు, పేదల కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీనే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు గెలిపించాలని సీపీఎం నియోజకవర్గ కన్వీనర్ దుర్గం దినకర్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరుతూ మండలంలోని రాంపూర్, నవేగాం, రాళ్లపేట, బుద్దానగర్, పుంజుమేరగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కూలీల పక్షాన ఎర్రజెండా నిలుస్తుందన్నారు. నాయకులు తికనంద్, పురుషోత్తం, సతీశ్, నిఖిల్, తిరుపతి, శ్రావణి, శ్రీకాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం సాయంత్రం సదాశివపేట్‌లో ఎంపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ ఎన్నికల్లో ఇండియా కూటమి భాగస్వామి ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని సీపీఎం నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని బోదంపల్లి, ముత్తంపేట గ్రామాల్లో ఎంపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మానిశ్, తిరుపతి, రవీందర్‌గౌడ్, ఆగయ్య, శ్రీనివాస్, దేవయ్య, రాంచందర్, సంతోష్, ప్రభాకర్, రాజ్‌కుమార్, శంకర్, సంపత్, లక్ష్మి, విజయ, తులసి, తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌రూరల్: పని ప్రదేశంలో ప్రచారం చేస్తున్న నాయకులు


రాంపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు